
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 4 జూలై 2025



వరదలపై అప్రమత్తం

- గత అనుభవాలతో విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం
- అందుబాటులో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్
- కలెక్టర్ ఆదేశాలతో హెలీప్యాడ్‌కు ఏర్పాట్లు: కేఎంసీ కమిషనర్

మున్నేరు ఉధృతిని అంచనా వేయాలి | విపత్తుల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష

6

పూరిల్లు లేని పల్లెలే
ప్రభుత్వ లక్ష్యం

- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- మంత్రికి తమ గోడు చెప్పుకొన్న పలువురు మహిళలు



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


రఘునాథపాలెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పూరిల్లు పల్లెల నిర్మాణమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, కాంగ్రెస్ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా పల్లెల అభివృద్ధిపైనే దృష్టి పెడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం రఘునాథపాలెం మండలం వేపకుంట్లలో పర్యటించిన ఆయన రూ.50లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రఘునాథపాలెం మండలం ఆవిర్భావం నుంచి తాను చేపట్టిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని 36 చెరువులకు సాగర్ జలాలు అందాయన్నారు. ఒకప్పుడు వర్షాధారంగా ఉన్న మండలంలో ఇప్పుడు రెండు, మూడు పంటలు సాగు చేసేందుకు సాగునీరు అందుబాటులోకి వస్తోందన్నారు. గిరిజన రైతులు ఆయిల్ పామ్ సాగు చేసి ఆధునిక వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తుమ్మల వద్దకు వచ్చిన మహిళలు దారా అమృతమ్మ, వంకాయల కళావతి, (మిగతా 6వ పేజీలో)



అప్రమత్తతే రక్ష

'ఆంధ్రజ్యోతి'తో డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

6



గతేడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఎర్రుపాలెం నుంచి అమరావతికి (నంబూరు) 55.8కి.మీ. ప్రత్యేక రైలుమార్గం నిర్మాణ ప్రక్రియ వడివడిగా సాగుతోంది. ఇందుకు సంబంధించి ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో రెవెన్యూ అధికారులు భూసేకరణ పూర్తిచేశారు. త్వరలో ఆ భూములను రైల్వేశాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఎర్రుపాలెం నుంచి విజయవాడకు ఒక రైలుమార్గం వెళుతుండగా ఏపీ రాజధాని అమరావతికి ఎర్రుపాలేనికి మధ్య మరో రైలుమార్గాన్ని రూ.2,047 కోట్లతో నిర్మించబోతున్నారు. విజయవాడ వెళ్లకుండానే ఎర్రుపాలెం నుంచి నేరుగా అమరావతికి వెళ్లేలా ఈ మార్గాన్ని రూపకల్పన చేయగా.. ఇది పూర్తయితే ఇరు ప్రాంతాల మధ్య దూరం తగ్గనుంది.

వడివడిగా..

- చురుగ్గా ఎర్రుపాలెం టు అమరావతి ప్రత్యేక రైలుమార్గం ప్రక్రియ
- ఎర్రుపాలెం మండలంలో భూసేకరణను పూర్తి చేసిన అధికారులు
- త్వరలో రైల్వేశాఖకు అప్పగించేలా చర్యలు
- కొత్త రైల్వేలైన్‌తో అమరావతికి తగ్గనున్న దూరం

ఖమ్మం, జూలై 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ, ఆంధ్రాకు వచ్చి పోయే రైళ్లు ఇప్పటివరకు తెలంగాణ సరిహద్దులోని ఎర్రుపాలెం ట్రాక్‌నుంచి నడుస్తున్నాయి. అయితే ఏపీలో ఏర్పడబోతున్న కొత్త రాజధాని అమరావతికి వెళ్లే క్రమంలో విజయవాడ వెళ్లకుండా ఎర్రుపాలెం నుంచి ప్రత్యేక రైలుమార్గం ఏర్పాటుచేసి గూడ్సురైలుతోపాటు కొన్ని ప్రయాణికుల రైళ్లను రాయలసీమ, తమిళనాడు, తదితర ప్రాంతాలకు నడిపే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం విజయవాడ మీదుగా వెళుతుండటంతో దూరం పెరుగుతుండగా.. విజయవాడ జంక్షన్‌లో ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లతోపాటు గూడ్సురైళ్ల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. షెడ్యూల్ సమయం కంటే ఎక్కువ పడుతోంది. ట్రాక్ క్లియర్ కావాలంటే రైల్వేశాఖ అధికారులకు కూడా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎర్రుపాలెం-అమరావతి రైలుమార్గం ఏర్పాటుతో విజయవాడ వైపు కాకుండా దూర ప్రాంతాల రైళ్లు నేరుగా అమరావతి మీదుగా రాకపోకలు సాగి విజయవాడ స్టేషన్‌లో ట్రాఫిక్ సమస్య తొలగనుంది. ఇందుకోసం కృష్ణానది మీద ప్రత్యేక రైల్వేబ్రిడ్జి ఏర్పాటు చేయబోతున్నారు. ఈ కొత్త రైల్వేలైన్ కోసం ఎర్రుపాలెం, కేసిరెడ్డిపాలెం గ్రామాల్లో సుమారు 24.24 ఎకరాలు అవసరం కాగా.. రెవె న్యూ అధికారులు ఆ భూమి సేకరణను పూర్తిచేశారు. అయితే రైతులకు రైల్వేశాఖనుంచి పరిహారం రావాల్సి ఉంది. ప్రస్తుతం ఆ భూమి విలువ నిర్ధారణ ప్రక్రియ జరుగుతోంది. అది పూర్తయి రైతులకు పరిహారం అందితే ప్రత్యేక రైలుమార్గం పనులు షురూ అవుతాయి. త్వరితగతిన ఈరైలుమార్గాన్ని పూర్తిచేసేందుకు ఇప్పటికే డీపీఆర్ పూర్తి చేయగా.. అటు ఏపీవైపున భూసేకరణ కూడా పూర్తిచేసినట్టు సమాచారం.

మొత్తం తొమ్మిది స్టేషన్లు

వాస్తవానికి ఎర్రుపాలెం-అమరావతికి 2018లోనే కేంద్రం రైలుమార్గం మంజూరుచేసినా ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మారడంతో నిలిచిపోయింది. విజయవాడ-హైదరాబాదు రైలుమార్గంలోని ఎర్రుపాలెం వద్ద మొదలై అమరావతి మీదుగా గుంటూరు, విజయవాడ లైన్‌లో ఉన్న నంబూరు వద్ద ఈ రైలుమార్గం కలుస్తుంది.ఎర్రుపాలెం తర్వాత పెద్దాపురం, చిన్నరావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్లమాను, అమరావతి, తాటికొండ, కొప్పరావూరులో మొత్తం 9 రైల్వేస్టేషన్లు ఉంటాయి. వీటిలో పెద్దాపురం, పరిటాల, అమరావతి, కొప్పరావూరులను పెద్దస్టేషన్లుగా నిర్మిస్తారు. జిల్లాపరిధిలోని ఎర్రుపాలెం స్టేషన్ ఆధునికీకరించడంతో పాటు విజయవాడ-అమరావతి వైపు వచ్చి వెళ్లే రైళ్లకు ఎర్రుపాలెం వద్ద కూడా రైల్వేశాఖ సాంకేతికంగా అన్ని హంగులు కల్పించనుంది. ఈ మార్గం ద్వారా ఖమ్మంనుంచి అమరావతికి రాకపోకలు మరింత సులువు కానున్నాయి. ప్రతిరోజు ప్యాసింజర్ రైళ్లు అమరావతి, వరంగల్‌కు తిరిగే అవకాశం ఉంది. రైల్వే శాఖకు భూ బదలాయింపు జరిగిన వెంటనే రైల్వేశాఖ ప్రత్యేకమార్గం నిర్మించనుంది.

పాలేరు అభివృద్ధికి.. 18నెలల్లో
రూ.1500కోట్లు

- ఖమ్మం నగరానికి దీటుగా కూసుమంచిని తీర్చిద్దుతాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బాగుచేస్తూనే హామీలు నెరవేరుస్తున్నాం
- కూసుమంచి పర్యటనలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి
- ఖమ్మం ఎంపీ, కలెక్టర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శ్రీకారం



కూసుమంచిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ అనుదీప్

కూసుమంచి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18నెలల్లో పాలేరు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు గాను సుమారు రూ.1500 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి కూసుమంచిలో పర్యటించారు. పలు రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా కూసుమంచిలో జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, కూసుమంచి, నేలకొండపల్లి మండల కేంద్రాల్లో రూ.6.50కోట్లతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, జంక్షన్ల అభివృద్ధి పనులు నెలరోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఖమ్మం నగరానికి దీటుగా కూసుమంచిని అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో అంతర్గత రహదారుల నిర్మాణం పూర్తిచేశామని, రూ.50లక్షలతో షాదీఖానా, రూ.5.50కోట్లతో జూనియర్ కళాశాల మంజూరయ్యాయని, త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆదిశగా ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. విడతలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.1500 కోట్లకుపైగా అభివృద్ధి పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉందన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ శంకుస్థాపన చేసిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, పనులు నాణ్యతతో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులు, (మిగతా 6వ పేజీలో)

మరికొందరికీ..
చేయూత!

- ఉమ్మడి జిల్లాలో 1,450మంది హెచ్ఐవీ బాధితులకు పింఛను మంజూరు
- ఇప్పటికే 3,691మందికి అందుతున్న సాయం



ఖమ్మం కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మరికొందరు హెచ్ఐవీ (ఎయిడ్స్) బాధితులకూ ప్రభుత్వం చేయూతనందిస్తోంది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న, పెండింగ్‌లో ఉన్న హెచ్ఐవీ బాధితులకు పింఛన్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏళ్లతరబడి సాయం కోసం నిరీక్షిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,450 మందికి పింఛన్ అందనుంది. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 5,141 మంది హెచ్ఐవీ బాధితులుండగా.. వీరిలో ఇప్పటికే 3,691 మందికి పింఛన్ అందుతోంది. మరో 1,450 మంది మూడేళ్లుగా పింఛన్ మంజూరు కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇటీవలే ప్రభుత్వం అర్హులైన వారందరికీ పింఛను మంజూరు చేయగా.. (మిగతా 6వ పేజీలో)

కొలిక్కి వస్తున్న కసరత్తు

- భద్రాద్రి రామాలయ అభివృద్ధికి మార్గం సుగమం
- పరిహారం అందుకున్న 40మంది ఇళ్ల యజమానులు
- ఇక ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపే తరువాయి
- త్వరలో ఇళ్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభం



భద్రాచలం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా సుమారు ఒక ఎకరం స్థలాన్ని సేకరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 40ఇళ్లు తొలగించాలని నిర్ణయించగా ఇందుకు సంబంధించిన నివేదికను పంపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి రూ.34.45 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో రెవెన్యూ అధికారులు ఇంటి యజమానులకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టగా ఇప్పటికే 31 కుటుంబాలు పరిహారం తీసుకున్నాయి. కాగా మిగిలిన ఇంటి యజమానులు సైతం తాజాగా పరిహారాన్ని తీసుకున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రామాలయ అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఆలయ అభివృద్ధి పనులకు ఎటువంటి న్యాయపరమైన ఆటంకాలు తలెత్తకుండా సామరస్యపూర్వకంగా ఇంటి యజమానులను ఒప్పించేలా చూడాలని ప్రభుత్వం ముందుగానే అధికారులకు స్పష్టం చేసింది. ముఖ్యంగా పనులు ప్రారంభమయ్యే సమయానికి అంతా సవ్యంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో 40మంది ఇంటి యజమానులు పరిహారం తీసుకోవడంతో ఇళ్ల తొలగింపు ప్రక్రియ సైతం వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత నాలుగు నెలలుగా పరిహారం చెల్లింపు ప్రక్రియ సాగగా ఇళ్ల తొలగింపు ప్రక్రియ మరో 40రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇక ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లింపే మిగిలింది

రామాలయం దక్షిణం వైపు అభివృద్ధి పనులు చేపడుతున్న క్రమంలో పరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తికావడంతో (మిగతా 6వ పేజీలో)

'ఇంటర్'లో వృత్తి విద్యా కోర్సులు

- జిల్లాలో పలు జూనియర్ కళాశాలల్లో బోధనకు అనుమతులు
- ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం
- ఇంటర్ బోర్డు నుంచి ఇప్పటికే అందిన ఆదేశాలు

కల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులకు అనుమతులొచ్చాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే ఈ కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నుంచి ఆయా కళాశాలలకు ఆదేశాలు అందాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరుతోపాటు పెండ్రప్రోలు, ఏన్కూరు, మధిర, కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ వృత్తి విద్యా కోర్సులు మంజూరవగా.. వాటిలో మల్టీపర్పస్ (మిగతా 6వ పేజీలో)

నారుమడులకు ఎన్నెస్పీ నీళ్లు

- నీటిపారుదల శాఖ అధికారుల ప్రతిపాదన

ఖమ్మం, జూలై 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కృష్ణా నది ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు వరుసగా నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణా పరివాహకంలోని అలంపర్తి, నారాయణపూర్, ఉజ్జని, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులకు క్రమంగా నీరు చేరుతోంది. ఈ వారంరోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఆయా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు అవకాశాలున్నాయి. దీంతో ఎగువన కురుస్తున్న వర్షాలు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను దృష్టిలో పెట్టుకుని సాగర్‌నుంచి ఒక టీఎంసీ నీటిని నారుమడులకు విడుదల చేసేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ఎన్నెస్పీ అధికారులకు ప్రతిపాదన చేశారు. ప్రస్తుతం కొన్ని చోట్ల నారుమళ్లకు నీటి ఎద్దడి నెలకొంది. ఇటీవల కురిసినవర్షాలతో కొంత ఉపయోగం కలిగినా కొంత నీరు విడుదల చేస్తే రైతులకు ప్రయోజనంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాలేరులో 23 అడుగులకు గాను12.50అడుగులు, నాగార్జునసాగర్‌లో 590అడుగులకు 517 అడుగులు నీరు నిల్వ ఉంది. ఒక టీఎంసీ నీటిని (మిగతా 6వ పేజీలో)



మాట్లాడుతున్న పోటు రంగారావు

నీటి కేటాయింపుల్లో..
కేంద్రం, సీడబ్ల్యూసీ జోక్యం చేసుకోవాలి

- బనకచర్ల బూచిగా రాష్ట్రంలో రాజకీయ రగడ
- నదీ జలాల పంపిణీ హేతుబద్ధంగా జరగాలి
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య గోదావరి నీటి కేటాయింపుల్లో కేంద్రం, సీడబ్ల్యూసీ జోక్యం చేసుకోవాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల బూచిగా రాష్ట్రంలో కొద్దిరోజులుగా రాజకీయ రగడ జరుగుతోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రశాంతంగా ఉన్న తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చుపెడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయలేక కాంగ్రెస్, ఫోన్ ట్యాపింగ్, ఇతర కేసుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఆ పార్టీలు గోదావరి జలాల పంపిణీ సాకుతో అప్రజాస్వామికంగా తిట్టుకుంటున్నాయని విమర్శించారు. ప్రజలు వినలేని విధంగా దూషణలు చేసుకోవడం సమాజానికి మంచిది కాదన్నారు. గోదావరి నదీ జలాలు తెలుగు రాష్ట్రాలకు హేతుబద్ధంగా అందేలా కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ వాటర్ కమిషన్ చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనపై దృష్టి పెట్టాలని, ఫార్మసీ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 40 మందికి పైగా దుర్మరణం చెందారని ఆ మరణాలను మేనేజ్‌మెంట్ హత్యలుగా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాసంఘాలతో సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సీవై పుల్లయ్య, నాగేశ్వరరావు, అశోక్, ఝాన్సీ పాల్గొన్నారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

ఖమ్మం వ్యవసాయం, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుపనులు జోరందుకున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని, యూరియా కొరతపై వస్తున్న అవాస్తవాలను ఎవరు నమ్మవద్దని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులకు ఈవానాకాలం పంటలకు కావాల్సిన యూరియాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. ముందస్తుగానే అంచనాలు తయారు చేసుకుని జిల్లాకు యూరియా దిగుమతులను తీసుకువచ్చినట్టు వివరించారు. కొన్నిచోట్ల యూరియా కొరత ఉందని ప్రచారం జరుగుతుందని, దానిలో ఎలాంటి వాస్తవంలేదని తెలిపారు. 2023లో 1290 మెట్రిక్ టన్నుల యూరియాను విక్రయించారని, 2024లో 1663, 2025జూన్‌వరకు 1281 మె.ట. యూరియాను విక్రయించారని తెలిపారు. ఈజులై నెలలో జిల్లాలో పదివేల మెట్రిక్ టన్నుల యూరియా నిలవలు సిద్ధంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో యూరియాను ఎంఆర్పీ ధరలకే అన్ని చోట్ల విక్రయిస్తున్నారని దీనిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయించినట్టయితే వెంటనే ఫిర్యాదు చేయాలని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా యూరియా విక్రయాలు జరపాలని తెలిపారు.



డి.పుల్లయ్య, జేడీఏ

ఢిల్లీ సదస్సుకు మేయర్



ఖమ్మం కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నగరాల అభివృద్ధిపై ఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సుకు ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, ఉప మేయర్ ఫాతిమా జోహార గురువారం హాజరయ్యారు. అమృత్ పథకం అమలవుతున్న నగర పాలక సంస్థల్లో పాలక వర్గాల అభిప్రాయాలు తెలుసుకునేందుకు, భవనాల నిర్మాణం, తాగునీటి పథకాలు తదితర వాటిపై చర్చించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

అప్రమత్తతే రక్ష

'ఆంధ్రజ్యోతి'తో ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



ఖమ్మం కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. అందరూ ఆరోగ్యసూత్రాలు పాటిస్తే వానాకాలం లో ఆరోగ్యంగా ఉండొచ్చు. శారీరక వ్యాయామం, మెరుగైన ఆహారంతో రోగాలకు దూరంగా ఉండొచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ కళావతిబాయి తెలిపారు. వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె పలు సూచనలు చేశారు.

పరిశుభ్రతే ప్రధానం...!

ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వాన నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. మలేరియా, విషజ్వరాలు సోకే ప్రమాదం ఉంటుంది. పారేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, కూలర్లు, పూలకుండీలు, పగిలిపోయిన కుండలు, ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, నీటితొట్లు తదితర వాటిలో డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాప్తి చెందించే దోమలు ఆవాసం ఉంటాయి. వాటిని లేకుండా చూసుకోవాలి.

డ్రైడే పాటించాలి

దోమల నివారణకు ఇళ్లలో ప్రతి వారం డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలోని కుండీలు, డబ్బాల్లో నీటి నిల్వను తొలగిస్తే దోమల బెడద నియంత్రించవచ్చు.

తాగునీటి పట్ల అప్రమత్తంగా ఉండాలి

వానాకాలంలో క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి. పంచాయతీల్లో గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగితే ఇంకా శ్రేయస్కరం.

ఆహార నియమాలు పాటించాల్సిందే..

ఉదయం, సాయంత్రం రెండు పూటల వేడిగా ఉన్నప్పుడే ఆహారాన్ని తినాలి. ఉదయం వండిన ఆహారం మరోరోజు తింటే ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. సీజన్‌లో దొరికే పండ్లు బాగా తీసుకోవాలి.

వైద్యశాఖ సిబ్బందిని అప్రమత్తం చేశాం..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాం. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను జ్వరాలు, ఇతర వ్యాధులపై ఎప్పటికప్పుడు వైద్యశాఖకు సమాచారం అందించాలని ఆదేశించాం. డెంగ్యూ, మలేరియా కేసులు తగ్గించేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించా లని సూచించాం. ఎక్కడ సమస్య ఉత్పన్నమైనా తక్షణమే ఉన్నతాధికారు లకు సమాచారం తెలిపేలా వైద్యాధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశాం.

అక్కా.. నీ బిడ్డ ఆరోగ్యం బాధ్యత నాది..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ



ధర్మాతండాలో పరుశురాం భార్యను ఓదార్చుతున్న మంత్రి

కూసుమంచి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండల పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ధర్మాతండాలో ఆత్మహత్యకు పాల్పడిన జర్పుల పరుశురాం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మంచంమీద అచేతనస్థితిలో ఉన్న పరుశురాం కూతురు సింధు ఆరోగ్య పరిస్థితిని తల్లి లలితను అడిగి తెలుసుకున్నారు. మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి ఎదుట లలిత కన్నీటి పర్యంతమైంది. తన కూతురు వైద్య ఖర్చుల బిల్లులకు సీఎంఆర్ఎఫ్ నిమిత్తం రెండేళ్లుగా క్యాంపు కార్యాలయం చుట్టు తిరుగుతున్నా.. పట్టించుకోలేదంటూ కన్నీటి పర్యంతమైంది. దీంతో తన భర్త పరుశురాం ఆర్థిక ఇబ్బందులతో, చేసిన అప్పులు తీర్చలేక, అనారోగ్యంతో ఉన్న కూతురు వైద్య ఖర్చులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ ఏడ్చింది. దీంతో స్పందించిన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అక్కా నీకూతురు ఆరోగ్యం బాధ్యత నాది.. ఎంపీ రాఘురాం రెడ్డి, తాను కలిసి స్వయంగా హైదరాబాద్ హాస్పిటల్‌కు వచ్చి వైద్యులతో మాట్లాడి వైద్యం అందేలా చూస్తాం. అధైర్యపడొద్దంటూ హామీ ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ బిల్లులు మంజూరు చేయిస్తానని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

నారుమడులకు ఎన్నెస్పీ నీళ్లు

(5వ పేజీ తరువాయి)

ముందుగా విడుదలచేస్తే నారుమళ్లకు ఉపయోగపడటంతో పాటు కొన్ని చెరువులను కూడా నింపే అవకాశం కలగనుంది. దీనికితోడు సాగర్ కాలువల వెంట ఉన్న ఎత్తిపోతల పథకాలనుంచి కూడా చెరువులకు నీరు మళ్లించే అవకాశం కూడా ఉంటుంది. అయితే ఎగువ నుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకుని అధికారికంగా నీటిపారుదలశాఖ అధికారులు నీటి విడుదలపై పరిశీలన చేస్తున్నారు. పాలేరు వద్ద నిర్మిస్తున్న యూటీ పనులు కూడా వారంరోజుల్లో పూర్తికానున్నాయి. ఈ పనులు పూర్తయితేనే నీటి విడుదలకు ఆటంకాలు తొలిగినట్టేనని అధికారులు అంటున్నారు.

'ఇంటర్'లో వృత్తి విద్యా కోర్సులు

(5వ పేజీ తరువాయి)

హెల్త్ వర్కర్ (మహిళ విభాగం), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), వ్యవసాయ పంటల ఉత్పత్తి (ఏసీపీ), మత్స్యపారిశ్రామిక కోర్సు (ఫిషరీస్) అందుబాటులోకి రానున్నాయి. అయితే ఈ కోర్సుల విద్యాబోధనకు గాను అధ్యాపక పోస్టులతో పాటు ల్యాబ్ అటెండర్ల పోస్టులు కూడా మంజూరు కానున్నాయి. ఈ క్రమంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పై కోర్సులు ఏర్పాటుకు గాను తరగతి గదుల ఏర్పాట్లపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. సగటున ఒక్కో కోర్సుకు గాను 20 వరకు సీట్లు మంజూరవగా, నాలుగు కోర్సులకు కలిపి 80 సీట్లు కేటాయించారు. ఇటీవల ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్), ఎంఎల్‌టీ, ఏసీపీ, ఫిషరీష్ కోర్సులకు ఎంతో డిమాండ్ ఉండగా.. ఈ కోర్సులు స్థానిక ప్రభుత్వ కళాశాలకు మంజూరు కావటంతో గ్రామీణ విద్యార్థులకు ఒక వరంలా పేర్కొంటున్నారు. అయితే రాష్ట్ర స్థాయిలోనే కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఉన్న ప్రాముఖ్యత, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో కల్లూరు ప్రభుత్వ కళాశాలలో వృత్తి విద్య కోర్సులకు అవకాశం దక్కింది. త్వరలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ వృత్తి విద్య కోర్సుల నిర్వహణపై తగిన సౌకర్యాల కల్పనపై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ప్రత్యేక దృష్టి సారించారు.

హాస్టల్ లేక విద్యార్థుల అవస్థలు

ఇప్పటికే కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వందల మంది విద్యార్థులు చదువుతుండగా.. అంతా నిరుపేద కుటుంబాల వారు, సుదూర ప్రాంతాల వారున్నారు. ప్రభుత్వం తరుపున ఇంటర్ విద్యార్థులకు ఇక్కడ వసతి గృహం లేక వారంతా అవస్థలు పడుతున్నారు. గతంలో పలుమార్లు ప్రభుత్వ పాలకుల దృష్టికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వసతి గృహం అవసరతను తీసుకెళ్లారు. అయినా నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కల్లూరులోని జూనియర్ కళాశాలకు అనుబంధంగా బాలికలకు, బాలురకు ప్రత్యేకంగా సంక్షేమ వసతి గృహాలను మంజూరు చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే ఇక్కడ వృత్తి విద్య కోర్సులు కూడా త్వరలో ప్రారంభం కానుండటంతో వసతి గృహ కల్పనపై అధికారులు చొరవ చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వరదలపై అప్రమత్తం

- గత అనుభవాలతో విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం
- అందుబాటులో ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్
- అత్యవసర సమయంలో సేవలకు సొంతంగా డ్రోన్
- మున్నేరు ముంపు ప్రాంతాల్లో ఆపదమిత్రలు, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు
- నేడు జిల్లా పర్యటనకు జాతీయ విపత్తుల కమిటీ
- కలెక్టర్ ఆదేశాలతో హెలీప్యాడ్‌కు ఏర్పాట్లు: కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): గత సెప్టెంబరు 1న ఉప్పెనల వచ్చిన వరద ముంపు మున్నేరు పరివాహకంలోని ప్రజలను ముంపునకు గురి చేసింది. వాహనాలతో పాటుగా నివాసాల్లోని దుస్తులు, బంగారం, వెండి, ఫర్నిచర్, బియ్యం, ఉప్పు, పప్పుతో సహా సర్వం వరదలో కొట్టుకుపోయాయి. ఇంటిలోని నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను కనీసం తీసుకునే అవకాశం ఇవ్వలేదు. కేవలం గంటల వ్యవధిలోనే పరివాహక ప్రాంతమైన 16, 17, 28, 29, 30, 34, 35, 46, 47, 48, 59, 60 డివిజన్లలోని ప్రజలను నిరాశ్రేయులను చేసింది. అయితే గత విపత్తు అనుభవాలతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ అనుదీప్ సూచనలతో ఇప్పటికే ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ సర్వం సిద్ధం చేశారు. మున్నేరు ముంపు ప్రాంతాలే కాకుండా ఖమ్మం నగరంలోని మైదాన ప్రాంతాల్లో ముంపుకు గురికాకుండా వరద నీరు సజావుగా సాగేలా కార్యాచరణ చేశారు.

ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బలగాలు

అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను గత పక్షం రోజులుగా ఖమ్మంలోనే ఉంచారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేఎంసీ పరిధిలో పనిచేస్తున్న డీఆర్ఎఫ్ బలగాలకు శిక్షణ ఇచ్చారు. వరదల తీవ్రత తగ్గే వరకు ఖమ్మం నగరంలోనే ప్రజలతో పాటుగా ఎన్డీఆర్ఎఫ్ బలగాలను అనుక్షణం అందుబాటులో ఉంచారు. అలాగే స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఖమ్మం నగరంలోనే ఉంది. వరద ముంపును ఎదుర్కొనేందుకు ముందస్తుగానే ఖమ్మం నగరంలో స్టోర్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ప్రజల్ని రక్షించేందుకు అవసరమైన కిట్లు కేఎంసీ కార్యాలయంలో నిల్వలు ఉంచారు. ప్రత్యేకంగా నాలుగు బోట్లు సిద్ధం చేశారు. అర్బన్ తహసీల్దారు పర్యవేక్షణలో బృందాలు పనిచేయనున్నాయి.

ఆపద మిత్రలు

విపత్తుల సమయంలో ప్రజల్ని ఆదుకునేందుకు, తక్షణ సహాయం అందించేందుకు ఖమ్మం నగరంలో 120మంది వరకు ఆపద మిత్రలను ఎంపిక చేసి వారికి మెప్మా, విపత్తుల నివారణ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులను, కిట్లను పంపిణీ చేశారు. విపత్తుల సమయంలో పురుష ఆపద మిత్రలు రక్షణ చర్యలు చేపట్టనుండగా.. మహిళా ఆపద మిత్రలు ప్రజలకు కావాల్సిన వైద్య, ఇతర సేవల్ని అందించనున్నారు.

ప్రత్యేక అధికారుల నియామకం

నగరంలో మున్నేరుతో పాటు మైదాన ప్రాంతంలో ముంపుపై అప్రమత్తంగా ఉండేందుకు 12మంది వార్డు ఆఫీసర్లు, కేఎంసీ విభాగాల అధికారులను నియామకం చేశారు. డివిజన్లు, వీధుల వారీగా బాధ్యతలు కేటాయించారు. ఎప్పుడు వరదలు వచ్చిన ముందస్తుగా కేటాయించిన ప్రాంతాలకు యాక్షన్ ప్లాన్ మేరకు వెళ్లేందుకు శిక్షణ ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రజలతో వాట్సప్ గ్రూప్‌లను క్రియేట్ చేశారు.

కేఎంసీకి సొంతంగా డ్రోన్

ఆపదలో ఉన్న వారికి ఆహారం, మందులు, ఇతర అత్యవసర సేవలు అందించేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సొంతంగా డ్రోన్ కొనుగోలు చేశారు. డ్రోన్ ద్వారా సేవలు అందించేందుకు సిద్ధం చేశారు. ప్రత్యేకంగా ఓ ఉద్యోగికి శిక్షణ ఇచ్చారు.

ఐదు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు

వరదలు ఏ అర్ధరాత్రి వచ్చినా ప్రజలు క్షేమంగా చేరుకునేందుకు డివిజన్ల వారీగా ఖమ్మం నగరంలో ఐదు పునరావాస కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. ఏ పునరావాస కేంద్రానికి ఏ డివిజన్ ప్రజలు వెళ్లాలి అనే అంశాలను ఇప్పటికే ఆయా ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉన్న వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు అవగాహన కల్పించారు.

నేడు జాతీయ విపత్తుల కమిటీ రాక

వర్షాకాలం, మున్నేరు వరదల నేపథ్యంలో జాతీయ విపత్తుల కమిటీ (నేషనల్ డిజాస్టర్ మెనేజ్‌మెంట్ అథారిటీ)సభ్యులు గురువారం ఖమ్మం జిల్లా పర్యాటను రానున్నారు. గతేడాది వచ్చిన మున్నేరు వరదలు, తీసుకున్న చర్యలను కలెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో సమీక్షించి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. తర్వాత మున్నేరు పరివాహక ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఏర్పాట్లు చేశారు.

ముంపు నుంచి నగరాన్ని తప్పించేందుకు..

భారీ వర్షాల సమయంలో ఖమ్మం నగరంలోని ప్రధాన సెంటర్లు, వీదులు, లోతట్టు ప్రాంతాలు ముంపు నకు గురవుతున్నాయి. గత 20రోజులుగా కేఎంసీ పారిశుద్య గ్యాంగ్ బృందాలతో భారీ డ్రెయినేజీలను శుభ్రం



గత సెప్టెంబర్‌లో వరద ప్రాంతంలో పర్యటిస్తున్న కమిషనర్

చేశారు. మున్నేరుకు 24అడుగుల నీటి ప్రవాహం పెరిగిన తర్వాత మున్నేరు నీరు ఖమ్మం నగరంలోకి ప్రవేశిస్తుంది. అలా వచ్చిన వరద నీరు సాధ్యమైన మేరకు తిరిగి మున్నేరులో కలిసేందుకు కావాల్సిన కార్యాచరణ చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో హెలీప్యాడ్ సిద్ధం : అభిషేక్ అగస్త్య, కమిషనర్

గతేడాది మున్నేరు వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. ప్రాణహాని జరగకుండా చర్యలు తీసుకున్నాం. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బలగాలను స్థానికంగానే అందుబాటులో ఉంచాం. ఆపద మిత్రలను అందుబాటులో ఉంచాం. ఐదు పునరావాస కేంద్రాల్ని సిద్ధం చేశాం. కలెక్టర్ అనుదీప్ ఆదేశాలతో ఖమ్మంలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశాం. ప్రజలు విపత్తులపై భయపడాల్సిన అవసరం లేదు. ప్రాంతాల వారీగా బృందాలను అందుబాటులో ఉంచాం. వారి చెప్పిన సూచనలు ప్రజలు పాటించాలి.

మున్నేరు ఉధృతిని అంచనా వేయాలి

- నీటి వనరుల రిపోర్టింగ్ షెడ్యూల్ సిద్ధం చేయాలి
- విపత్తుల సన్నద్ధతపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి అంచనాలను సమర్థవంతంగా అందించాలని, ఆ దిశగా పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి విపత్తుల సన్నద్ధతపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరద అంచనా వ్యవస్థ కట్టుదిట్టంగా పని చేయాలని, నీటి వనరుల్లో నీటి నిల్వలు, ఎగువభాగాన ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో కురిసే వర్షాలు, వస్తున్న వరద వివరాలను నీటిపారుదల శాఖ అధికారులు రెగ్యులర్‌గా పర్యవేక్షించాలన్నారు. భద్రాచలంలో వరద ఉధృతికి సంబంధించి పకడ్బందీ వ్యవస్థ ఉందని, భద్రాచలం వద్ద వరద వివరాలు ప్రతి గంటకు తెలుస్తాయని, ఆ దిశగా ఖమ్మం జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.

- తీర్థాల, మున్నేరు, ఆకేరు వద్ద నీటి ప్రవాహం, నీటి నిల్వ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో అవసరమైన చోట వాటర్ గేజ్ ఏర్పాటు చేయాలని అన్నారు. గత వరదలను దృష్టిలో ఉంచుకొని జిల్లాకు వరద ఎంత వస్తుంది అనే సమాచారం ముందుగానే అందేలా చూడాలని, దీనికి సంబంధించి బాధ్యతలను నీటిపారుదల శాఖకు అప్పగిస్తూ మెమో జారీ చేయాలన్నారు.
- నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులతో వాట్సప్ గ్రూప్ తయారు చేసి, నీటి వనరుల పరిస్థితులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. వాటర్ గేజ్ జిల్లాలో ఎక్కడ పెట్టేది వివరాలను, రాబోయే 3 నెలల పాటు రిపోర్టింగ్ షెడ్యూల్ సిద్ధం చేసి సోమవారం నాటికి అందించాలని కలెక్టర్ ఆదేశించారు.
- విపత్తుల విషయంలో ప్రజలకు సమాచారాన్ని వేగంగా అందించాలన్నారు. మున్నేరు నది ఖమ్మం నగరానికి మొదటి, రెండో, మూడో ప్రమాద హెచ్చరికలు ఎప్పుడు జారీ చేయాలి, ఏ హెచ్చరిక సమయంలో ఏ ప్రాంతాలు ముంపునకు గురవుతాయి. ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఎస్వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ని సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో వరద విపత్తు నిర్వహణ బాధ్యత రెవెన్యూ వ్యవస్థపై ఉంటుందని, అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, వెంకట్రాం, ఖమ్మం ఆర్డీవో జి.నరసింహారావు, నీటిపారుదలశాఖ డీఈలు, ఖమ్మం అర్బన్, రూరల్ తహసీల్దార్లు సైదులు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్

మరికొందరికీ.. చేయూత!

(5వ పేజీ తరువాయి)

వారికి 'చేయూత'లో భాగంగా నెలకు రూ. 2,016 అందించనున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో 1450 మందికి తాజాగా పింఛన్ మంజూరైనట్టు డాక్టర్ వెంకటరమణ తెలిపారు.

పౌష్టికాహారం కోసం...!

హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచుకోవచ్చు. ఈ లక్ష్యంతో ప్రభుత్వం వారికి ఆర్థికంగా చేయూతనిస్తోంది. ప్రతినెలా వైద్యం, మందుల కోసం జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులకు వెళ్లాలంటే ఖర్చుల కోసం, పౌష్టికాహారం తీసుకోవడం కోసం పింఛన్ సౌకర్యాన్ని కల్పించింది. ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కేంద్రాలున్నాయి. నిత్యం ఇక్కడి ఏటీఆర్ కేంద్రాల్లో మందులు పంపిణీ చేస్తున్నారు. ఒకప్పుడు వరంగల్ ఎంజీఎంలో మాత్రమే మందులు పంపిణీ చేసేవారు. అక్కడి వెళ్లడం వ్యయప్రయాసలతో కూడుకోవడంతో ఏడేళ్లుగాఖమ్మం ఏటీఆర్ కేంద్రాల్లో మందులను పంపిణీ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో చేయూత పింఛన్ దారులిలా..

	ఖమ్మం	భద్రాచలం	మొత్తం
ఏఆర్టీ పింఛన్‌కు అర్హులు	3,469	1,672	5,141
పింఛన్ పొందుతున్న వారు	2,516	1,175	3,691
కొత్తగా పింఛన్ మంజూరైనవారు	953	479	1,450

పాలేరు అభివృద్ధికి.. 18నెలల్లో రూ.1500కోట్లు

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లకు సూచించారు. ఇదిలాఉండగా ధర్మాతండాలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన మంత్రి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్లనిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. మంత్రి పర్యటనలో ఖమ్మం ఆర్డీవో జి.నర్సింహారావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఇరిగేషన్ ఎస్ఈ ఎం.వెంటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, హౌజింగ్ పీడీ శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏడీ సరిత, విద్యుత్‌శాఖ ఏడీఈ కోక్యానాయక్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర



పూజలు చేస్తున్న భక్తులు

మధిర రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం నిధానపురం గ్రామంలో గురువారం బోనాలు, ముత్యాలమ్మ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్ద కాపు అమరవాది పున్నారెడ్డి, మాజీ సర్పంచ్ బాధా కృష్ణారెడ్డి, గుండా వీరారెడ్డి, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



బోనకల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గానూ బోనకల్ మండలం ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీలు షేక్ ఫరీదా, బొడ్డుపల్లి నవ్యశ్రీలు ఎంపిక కాబడ్డారు. అండర్-14 విభాగంలో మొత్తం 90 మంది పాల్గొన్నారు. వీరిలో ఫరీదా, నవ్యశ్రీలు ఎంపిక కావడంతో ఈ నెల 10వ తేదిన వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనున్నారు. విద్యార్థినీలను హెచ్ఎం భాగ్యలక్ష్మీ, పీడీ నవీద్ పాషా, ఏపీసీ చైర్మన్ చాంద్‌బీలు ప్రత్యేకంగా అభినందించారు.

పూరిల్లు లేని పల్లెలే ప్రభుత్వ లక్ష్యం



మహి ళల గోడు వింటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(5వ పేజీ తరువాయి) గోవిందాల స్వర్ణ కుమారి, కంటిపూడి సుజాత తదితరులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. తాము నిరుపేదలమైనా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదన్నారు. స్పందించిన మంత్రి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. తుమ్మల వెంట రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, తహసీల్దార్ శ్వేత, మాజీ సర్పంచ్ రేమళ్ల రమేష్ బాబు, గ్రామశాఖ అధ్యక్షులు చావగాని రామారావు, నాయకులు బాణోత్ వెంకన్న, రెంటేలా దానయ్య, అంగోత్ నరేశ్, భూక్య నవీన్, గొనగంటి రామారావు, ప్రేమ్‌కుమార్, సుధీర్, గుగులోత్ కౌశిక్, నేలాల దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి వస్తున్న కసరత్తు

(5వ పేజీ తరువాయి)

మరో కీలక ఘట్టానికి అధికారులు శ్రీకారం చుట్టబోతున్నారు. భూ సేకరణ చట్టంలో భాగంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు కోసం చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే భద్రాచలంలోని పాత ఆర్అండ్‌బీ కార్యాలయం సమీపంలో సుమారు మూడు ఎకరాల స్థలాన్ని అందజేసేందుకు చదును చేస్తున్నారు. మొత్తం 40 కుటుంబాలకు ప్లాట్లు చేసి లక్కీడ్రా ప్రాతిపదికన కేటాయించనున్నట్లు సమాచారం. ఒక్కొక్క ప్లాట్ సుమారు 90గజాల వరకు ఉంటుందని తెలుస్తోంది.

రామాలయ అభివృద్ధికి మార్గం సుగమమే

రామాలయ అభివృద్ధి పనుల్లో ప్రధాన ప్రక్రియ స్థల సేకరణ. ఈ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తి కావడంతో రామాలయ అభివృద్ధికి మార్గం సుగమమైంది. ఈ క్రమంలో దక్షిణం వైపు ఆలయ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. దాంతో చిత్రకూట మండపం, వంటశాల, ఆ భాగంలో ఉన్న పలు ఆలయాలను తొలగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో భక్తులకు మరింత సౌలభ్యంగా సేవలు అందించేందుకు అవసరమైన చర్యలపై సైతం ప్రభుత్వం దృష్టిసారిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా జీఎంఆర్ సంస్థ ఇటీవల ఏర్పాటు చేసిన క్యూలైన్, చిత్రకూట మండపం ముందు ఉన్న షెడ్లను తొలగించనున్నారు. అభివృద్ధి పనులు చేపట్టే తరుణంలో మరోసారి యధా ప్రకారం భక్తుల సౌకర్యార్థం ఆ షెడ్లను మళ్లీ ఏర్పాటు చేయనున్నారు. కాగా ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న రామాలయ అభివృద్ధి పనులు ప్రభుత్వం సత్వరమే చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

అసైదుల్లా హోరతి.. కాళ్ల గజ్జెల గమ్మతి..

- పల్లెల్లో కొలువు తీరిన సవర్లు
- వైభవంగా జరగనున్న మొహర్రం వేడుకలు

కరకగూడెం, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : 'అసైయ్ దుల్లా హోరతి' అని పాడగానే పాదాలు కదం తొక్కుతాయి. అగ్ని గుండం చుట్టూ, పీరీలను ఎత్తుకుని ఊరేగుతుంటే ఉత్సాహం ఉరకలెత్తుతుంది. మొహర్రం పండుగ సందర్భంగా జరిపే ఈ ఉత్సవాలు పల్లెల్లో సంబురాలు తెస్తాయి. ఈనెల 6న మొహర్రం పర్వదినం రానుండగా.. గ్రామాల్లో మూజావారులు కఠిన నిష్ఠతో నెలపొడుపు చూసిన తరువాత పీరీల దర్గ (గుడి) వద్ద ఒక్క పొద్దులతో పీరీలను కొలువు తీర్చుతారు. ఆ తర్వాత ఆరురోజుల పాటు భక్తులు దట్టిలు, మలీద, బెల్లం పానకం, సాంబ్రాణి నైవేద్యాలతో మొక్కులను చెల్లించుకుంటారు. ఈ క్రమంలో ఏడో రోజు శుక్రవారం ఉదయం చీకటితో ఆరు పీరీలను మాత్రమే నిదుర లేపి.. భక్తులు మొక్కులను చెల్లించి చిన్నసరిగెత్తుగా నిర్వహిస్తారు. తొమ్మిదో రోజు 6వ తేదీ ఆదివారం ఉదయం మొత్తం పీరీలను నిదురలేపి అగ్ని గుండంలో తిరుగుతారు. దీన్ని పెద్దసరిగెత్తుగా నిర్వహిస్తారు. సాయంత్రం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. వందల సంవత్సరాల నుంచి భక్తుల కోర్కెలు తీర్చుతున్న పీరీల పండుగ కరకగూడెంలో ఉమ్మడిజిల్లాలోనే మరింత కన్నుల పండుగ్గా జరుగుతుంది. షేక్ ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగే ఇక్కడి వేడుకలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచే కాకుండా ములుగు జిల్లా మంగపేట, తాడ్వాయి, కాటాపురం మండలాల నుంచి భక్తులు తరలొస్తారు. ఇప్పటికే ఈ దర్గా వద్ద ఇటీవల సవార్లను మూజవార్లు భక్తి శ్రద్ధలతో కొలువు తీర్చారు. మొహర్రం రోజు గ్రామంలో ఊరేగింపు అనంతరం పెద్దవాగులో ముజావార్లు పీరలకు కర్బలలు నిర్వహించి దర్గాలోని పెట్టెలో భద్రపరుస్తారు.



పెద్దసరిగెత్తు ముందు రాత్రి అగ్ని గుండం చుట్టు అసైయ్ దుల్లా అంటూ ఆడుతున్న భక్తులు (ఫైల్)

మాలాశ్రీకి సాహితీ పురస్కారం

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ప్రముఖ కవి మాలాశ్రీకి 2025 భోగోజు పురుషోత్తం సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం అందజేయనున్నట్లు ఉరిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఉరిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌లు తెలిపారు. గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కథల, కవితల పోటీల ఫలితాలను వెల్లడించారు. రానున్న వార్షికోత్సవంలో కవి మాలాశ్రీకి పురస్కారంతో పాటు రూ. 10వేల నగదు అందిస్తామని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యరంగంలో విశేష కృషి చేస్తున్న కవులకు, ఈ పురస్కారాన్ని అందిజేస్తున్నట్లు తెలిపారు. పోటీలలో గెలిచిన విజేతల పేర్లను వెల్లడించారు.

సాయిబాబాకు మహా పుష్పాభిషేకం



ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 3(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా గురువారం జిల్లాలోని పలు సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత షిర్డి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా దీక్షాపరులు, బక్తులు వివిధ రకాల పుష్పాలతో ఊరేగింపు నిర్వహించి బాబాకు అర్చన అబిషేకం నిర్వహించారు. అనంతరం సుదర్శన, నారసింహ హోమం నిర్వహించారు. శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో 25వ గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా తేనేతో అబిషేకం, కోలాట బృందాలు, మేళతాళాలతో బాబా దీక్షాపరులు, భక్తుల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హజరై బాబాను దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రశాంతినగర్, ఎన్ఎస్టీ రోడ్, కవిరాజ్ నగర్, మమతారోడ్‌లోని షిరిడి సాయినాథుని ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాబా ఆలయాలో అన్నదానం నిర్వహించారు. భక్తులు బాబాను దర్శించుకోని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులు

▸▸ జాబితా విడుదల చేసిన అధికారులు



ఖమ్మం రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డులు ఖరారు చేస్తూ అధికారులు గురువారం తుది జాబితా విడుదల చేశారు. ఈ మున్సిపాలిటీలో మొత్తం 12 పంచాయతీలను కలిపి ఏదులాపురం మున్సిపాలిటీని ఫిబ్రవరి 6న ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఈ 12 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొత్తం 32 వార్డులుగా ఏర్పాటు చేసినట్లు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు.

- 1వ వార్డుకింద పల్లెగూడెం, రెడ్డిపల్లి, సాయినగర్, వికలాంగుల కాలనీ, భద్రాద్రి కాలనీలను కలుపుతు ఒక వార్డుగా ఏర్పాటు చేశారు. ఈ వార్డులో మొత్తం 1,595 ఓట్లు ఉన్నాయి.
- 2వ వార్డు కింద.. రాజీవ్ గృహకల్ప, నాలుగవతరగతి ఉద్యోగుల కాలనీ, సాయి కృష్ణ నగర్ ఉన్నాయి. ఇందులో 1,484 ఓట్లు ఉన్నాయి.
- 3వ వార్డు: నాయుడుపేట, కరుణగిరి. ఇందులో 1,504 ఓట్లు
- 4వ వార్డు:::: జలగంనగర్, ఆర్టీసీ కాలనీ, 1,485 ఓట్లు
- 5వ వార్డు: పెద్దతండా కాలనీ, కేబిఆర్ నగర్, ఆర్టీసీ కాలనీ ఇందులో 1,504 ఓట్లు
- 6వ వార్డు: సాయిప్రభాత్ నగర్, టెంపుల్ సిటీ, అభయ టౌన్ షిప్, సింగరేణి కాలనీ, ఇందులో 1,533 ఓట్లు
- 7వ వార్డు: గుర్రాలపాడు గ్రామం, ఆర్టీసీ కాలనీ, శ్రీవారీ నగర్ కాలనీ, సత్యసంకల్ప, షాబాస్ మైసి రెడ్డి నగర్‌లో, వరంగల్ క్రాస్ రోడ్డు, కోదాడ క్రాస్ రోడ్డుగుర్రాలపాడు ఏరియా లో 1,375 ఓట్లు
- 8వ వార్డు: ఇందిరమ్మ ఫేస్1, కోటనారాయణపురం లో 1,374 ఓట్లు
- 9వ వార్డు: చిన్న వెంకటగిరి, జంగాల కలనీ, ఏవిఆర్ వెంచర్, ఎస్సీ, బీసీ కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం ఏరియా 1,331 ఓట్లు
- 10వ వార్డు: ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ లో 1403 ఓట్లు
- 11వ వార్డు: ఓసీ కాలనీ, నంధ్యా తండా, బీసీ కాలనీ వంజర కాలనీ గుదిమళ్ల లో 1432 ఓట్లు
- 12వ వార్డు: పెద్దవెంకటగిరి, ఎస్సీబీసీ కాలనీ గ్రామపంచాయతి ఏరియా, చిన్నవెంకటగిరి, గుదిమళ్ల ఎస్సీ కాలనీ పార్ట్‌లో 1,257 ఓట్లు
- 13వ వార్డు: ఇందిరమ్మ ఫేస్2, జిప్లస్1 కాలనీ, ఎస్ఆర్ నగర్, మహలక్ష్మీ వెంచర్, టీవీఆర్. పెట్రోల్ బంక్ వెంకటగిరి క్రాస్‌రోడ్డు 1,214ఓట్లు
- 14వ వార్డు: తెల్దారుపల్లిలోని మహరాజుల కాలనీ, బోళ్లగడ్డ, పాటిమీది తండా, చాకలి బజార్ 1326 ఓట్లు
- 15వ వార్డు: ఆంజనేయస్వామి గుడి ప్రాంతం, ఎస్సీ, బీసీ కాలనీలో 1,346 ఓట్లు.
- 16వ వార్డు: లక్ష్మీనగర్, మోడల్ కాలనీ, న్యూ డబల్ బెడ్ రూం, తుమ్మల నగర్, మద్దులపల్లి పార్ట్‌లో 1,389
- 17వ వార్డు: మద్దులపల్లి పాత గ్రామం, ఇందిరమ్మ కాలనీ, టీకేఆర్ నగర్, మణికంఠ నగర్, లుంబినీ వనం, కోదాడ క్రాస్ రోడ్డు మద్దులపల్లి ఏరియా, వీరాంజనేయ వెంచర్‌లో 1,317 ఓట్లు
- 18వ వార్డు: బారుగూడెం, శ్రీ సిటీ, వాయిపుత్రనగర్ 1,386 ఓట్లు
- 19వ వార్డు: గొల్లగూడెం, డబుల్‌బెడ్ రూరం, శ్రీ సిటీ 7,8,9 రోడ్లు, వెంకటాద్రి టౌన్‌షిప్‌లో, నందనవనం గొల్లగూడెం లో 1,300 ఓట్లు
- 20వ వార్డు: బోడ్రాయి సెంటర్, సావిటి సెంటర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, బాలమ్మ చింత బజార్ లో 1,319 ఓట్లు
- 21వ వార్డు: నిమ్మతోట బజార్, ఎస్‌వీఆర్ నగర్, బోరింగ్ బజార్, హైస్కూల్ బజార్, ఆంజనేయస్వామిగుడి, బడుల్‌బెడ్ రూం ముత్తగూడెం,ఎస్‌వీఆర్‌నగర్ గోకులం టౌన్‌షిప్, కచీర్ల బండ లో 1,258 ఓట్లు
- 22వ వార్డు: టీఎన్జీవో కాలనీ, సాయిగణేష్ నగర్, సప్తగిరి నగర్‌లో 1,497 ఓట్లు
- 23వ వార్డు: గాయత్రీనగర్, సత్యనారాయణపురం, సాయినగర్, ఇందిరమ్మ కాలనీ, రాఘవేంద్రనగర్ రాజీవ్‌నగర్‌లో 1510 ఓట్లు
- 24వ వార్డు: సూర్యానగర్, చంద్రానగర్, తాళ్ళేసితండా, చిన్నతండా, కేఎల్ఆర్ బృందావనమ్, గోకుల కృష్ణ నగర్, ఆదిత్య టౌన్‌షిప్, నందనవనం ఏదులాపురం లో 1358 ఓట్లు
- 25వ వార్డు: టీచ్చర్స్ కాలనీ, నడిమి తండా, లెక్చరర్స్ కాలనీ లో 1,492
- 26వ వార్డు: పెద్దతండా జీపీ రోడ్డు, టీచ్చర్స్ కాలనీ లో 1438 ఓట్లు
- 27వ వార్డు: ఆర్ఎస్ నగర్, లక్ష్మీ బృందావనం, పెద్దతండా లో 1,482 ఓట్లు
- 28వ వార్డు: షాబాదునగర్, నారపొంగు బజార్, హచ్ ఎస్ బజార్, శ్రీరాంనగర్, మారుతి నగర్ రోడ్డు7,8,9, చైతన్య నగర్‌లో 1,366 ఓట్లు
- 29వ వార్డు: రైస్‌మిల్లు ఏరియా, వెంకటసుదానగర్, మారుతినగర్, శ్రీరాంనగర్ పార్ట్2 లో 1,333 ఓట్లు
- 30వ వార్డు: ఆటోనగర్ కాలనీ, డీబీఆర్ నగర్, సాయి బృందావనం కాలనీ, పోస్నేకల్లు డొంక, కొప్పుల బద్రయ్య నగర్ లో 1,285 ఓట్లు
- 31వ వార్డు: ఏదులాపురం ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, (వాటర్‌ట్యాంక్ ఏరియా) ఆదిత్యనగర్ లో 1,430 ఓట్లు
- 32వ వార్డు: ఏదులాపురం బీసీ కాలనీ (గ్రామపంచాయతీ ఏరియా) వెంపటినగర్, ఓరుగంటి నగర్, సింహద్రినగర్‌లో 1,297 ఓట్లు ఉన్నాయి.

ఐటీఐ కాలేజీ నిర్మించాలని వినతి

తిరుమలాయపాలెం, జూలై3(ఆంధ్రజ్యోతి)తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబరు 254లో ఐటీఐ కాలేజీ నిర్మించాలని కోరుతూ అఖిలపక్షపార్టీల ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. మండలానికి ఇటీవల రూ.45కోట్లతో ఐటీఐ కాలేజీ మంజూరు చేసిందని, తిరుమలాయపాలెంలో కళాశాల నిర్మించాలని వారు తెలిపారు. ఇక్కడ కళాశాల ఏర్పాటుచేస్తే అన్నివర్గాల వారికి ప్రయోజనం ఉంటుందన్నారు ఈకార్యక్రమంలో వెన్నబోయిన రమేష్, కొమ్ముపూలే, గుగ్గిళ్ల అశోక్, గద్దెల మన్మథరావు, వీ.బాబు, ఏసుబాబు, వంగూరి మధు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ



అచ్చమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

కామేపల్లి, జూలై 3(ఆంధ్రజ్యోతి): కామేపల్లి పీఏసీఎస్ ఛైర్మన్, పీసీసీ సభ్యుడు, జిల్లా ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం తల్లి అచ్చమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలిసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం వీరభద్రాన్ని పరామర్శించారు. అచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య రవి, దారా సుందర్‌రావు నాయకులు తదితరులు ఉన్నారు.

పర్యావరణ రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



ఉద్యోగులకు జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, కార్యాలయాలకు విధులకు హాజరయ్యే సమయంలో ఖచ్చితంగా జూట్ బ్యాగ్‌లను వాడాలని సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ఉద్యోగులకు సూచించారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ దినోత్సవం సందర్భంగా గురువారం సాంఘీక సంక్షేమశాఖ కార్యాలయంలోని ఉద్యోగులకు జూట్ బ్యాగ్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్యోగులు తమ నివాసాల్లో ప్లాస్టిక్ సంచులు వాడకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీహన్షిక జూట్ వరల్డ్ నిర్వాహకురాలు పాకాలపాటి అరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి

▸▸ జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య

కూసుమంచి, జూలై 3(ఆంధ్రజ్యోతి): విత్తన చట్టానికి లోబడే డీలర్లు వ్యాపారం చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య తెలిపారు. గురువారం కూసుమంచిలో విత్తన, పురుగుమందుల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏడీఏ సరిత, ఏవో వాణిటెక్నికల్ ఏవో అరుణ తదితరులున్నారు. అనంతరం గుర్వాయిగూడెం గ్రామంలో పెసర, పత్తి చేలను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య



నిరసన తెలుపుతున్న మార్కెట్ ఉద్యోగులు

మార్కెట్ ఉద్యోగుల నిరసన

ఖమ్మం మార్కెట్ జూలై 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భాస్కర్, అదే మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌పై దాడి చేసిన సంఘటనను ఖండిస్తూ గురువారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు టి. కిరణ్‌కుమార్, ఎండీ. హిమాయత్‌హుస్సేన్, ప్రవీణ్‌రెడ్డి, చంద్రశేఖర్, పంతులునాయక్, సత్యనారాయణ, జగదీష్, వాసాల వెంకటేశ్వర్లు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 3(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా సత్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ సునీల్ దత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

సీలింగ్ భూమి స్వాధీనం

ఖమ్మం కలెక్టరేట్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): సీలింగ్ భూములను చేతులు మార్చి రియల్ ఎస్టేట్ చేసుకున్న కొందరి నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో 196/2, 196/1లో ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లెమడుగు రెవెన్యూ పరిధిలో బాణోత్ సక్కుబాయి, చుక్కమ్మకు కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం సీలింగ్ కింద భూమిని కేటాయించారు. కానీ వాస్తవ లబ్ధిదారులు అక్కడ లేకపోవడం కొంత మంది రికార్డులు తారుమారు చేసి రియల్ ఎస్టేట్ భూమిగా దాన్ని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఈనేపథ్యంలో రెవెన్యూ శాఖ కోర్టుకు వెళ్లగా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో గురువారం ఆ స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు.50 కోట్లు విలువ చేసే 9 ఎకరాల 9 గుంటల భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీన పరుచుకున్నారు. అర్బన్ తహసీల్దారు సైదులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వహీద్ ఆధ్వర్యంలో పంచనామా చేసి ఆ భూమికి హద్దులు కేటాయించి ప్రభుత్వ భూమి అంటూ బోర్డులను పాతించారు.

పూలే చిత్రపటాల అందజేత



బీసీ సంక్షేమశాఖ అధికారి జ్యోతికి పూలే చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై3(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా బీసీ సంక్షేమశాఖ ప్రత్యేక అధికారి జ్యోతికి మహత్మజ్యోతిరావు పూలే చిత్రపటాన్ని ఖమ్మంలో బహూకరించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే జయంతి నాటికి పూలే చిత్రపటాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు అందిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, మహిళా అధ్యక్షురాలు నలమాస సుగుణ, లింగనబోయిన పుల్లారావు, గద్దె వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి



రాములు(ఫైల్)

నేలకొండపల్లి, జూలై3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైనంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఎర్రబోయిన రాములు(60)గురువారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు, భార్య, పిల్లల నుంచి కొంతకాలంగా విడిగా ఉంటున్నాడు. మండల నాయకుడు నలమాస మల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు కారంగుల వీరబాబు, కుక్కల అబిషేక్, చల్లగుండ్ల గురవయ్య, మారగాని గోవర్ధన్ నివాళులర్పించారు.

అనారోగ్యంతో మహిళ...



లక్ష్మీబాయమ్మ(ఫైల్)

నేలకొండపల్లి, జూలై3(ఆంధ్రజ్యోతి):ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, నేలకొండపల్లి పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ కొమ్మినేని అనంతరామయ్య సతీమణి లక్ష్మీబాయమ్మ(95)గురువారం మృతి చెందారు. మృతురాలికి ఇరువురు కుమార్తెలున్నారు. నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, ఉన్నం బ్రహ్మయ్య, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, చాగంటి మధుసూధన్‌రావు తదితరులు మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించి, మృతురాలి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మం రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, శంకరయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ఓ వైద్యురాలి ఫోన్ హ్యాక్ చేసి రూ. 5లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. నగరంలోని ఎన్ఎస్‌టీ రోడ్‌లో నివసించే ప్రముఖ వైద్యురాలు స్వర్ణకుమారి ఫోన్‌ను గుర్తు తెలియని సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి అర్జెంటుగా రూ.55వేలు కావాలని వెంటనే తన అకౌంట్ నెంబర్‌కు యూపీఐ చేయాలని ఆమె పేరుపై సన్నిహితులకు, బంధువుల ఫోన్‌లకు సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపారు. దీంతో నమ్మిన బంధువులు, సన్నిహితులు వెంటనే సుమారు రూ.5లక్షల వరకు సైబర్ నేరగాళ్లు పెట్టిన నెంబరుకు యూపీఐ చేశారు. వీరిలో తెలిసిన వాళ్లు కొందరు డబ్బులు అంత అవసరం ఏమిటని ఆమెకు ఫోన్ చేశారు. దీంతో ఆమె నేను ఎవరిని డబ్బులు కావాలని అడగలేదని, మెసేజ్‌లు పెట్టలేదని తెలిపింది. వెంటనే తన ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు పంపిన మెస్సేజ్‌ను చూసి ఫోన్ హ్యాక్ అయినట్లు గుర్తించి, తన భర్త వైద్యుడు బాబురత్నాకర్‌కు వివరాలు తెలిపింది. ఆయన వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముంపు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆదేశాలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేకంగా నియామకం చేసిన బృందాలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. గురువారం కాల్వొడ్డు, బొక్కలగడ్డ మున్నేరు పరివాహక ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు వరద ప్రభావం అంచనాలను పరిశీలించారు. నీటి మట్టం తీరుపై పలు సూచనలు చేశారు. వరద తీవ్రత ప్రజలకు తాకకముందే బృందాలు అప్రమత్తంగా ఉండి వాలంటీర్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ట్రక్కు బోల్తా.. తప్పిన ప్రమాదం

నేలకొండపల్లి, జూలై3 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో గురువారం ఉదయం ట్రాక్టర్ ఖాళీ ట్రక్కు బోల్తా పడింది. ట్రక్కు బోల్తా పడిన సమయంలో ఎటు నుంచి వాహనాలు రాకపోవటంతోనూ, అక్కడె వరూ మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రక్కు బోల్తా పడిన సమయంలో వాహనాలు వచ్చినా... మనుషలున్నా పెద్ద ప్రమాదం జరిగేది. మట్టి తోలకాలు విపరీతంగా జరుగుతుండటం, ట్రిప్పులు ఎక్కువగా పడాలన్న ఉద్దేశంతో డ్రైవర్లు మితిమీరిన వేగంతో ట్రాక్టర్లను నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి ఇప్పటికైనా వాహనాల వేగాన్ని అదుపు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

ఖమ్మం రూరల్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మున్నేరులో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన ఎస్‌కే. అహ్మద్ (14), హరికృష్ణ, ఉస్మాన్, ఫజల్ అనే నలుగురు స్నేహితులు కలిసి పోలేపల్లి పరిధిలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలోని మున్నేరులోకి మంగళవారం సాయంత్రం ఈతకు వెళ్లారు. ఈత కొట్టే సమయంలో అహ్మద్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు కుటుంబసభ్యులకు విషయం తెలియచేయగా వారు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. బుధవారం వెతికినప్పటికీ అహ్మద్ ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం కరుణగిరి బ్రిడ్జి ప్రాంతంలో మృతదేహం నీటిలో కనిపించడంతో స్థానికులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెళ్లి మృతదేహన్ని బయటకు తీశారు. అన్నం శ్రీనివాస్ సహకారంతో పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేశారు.

రాయితీలను రైతులు వినియోగించుకోవాలి

సత్తుపల్లిరూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగించుకోవాలని సత్తుపల్లి ఉద్యానవన అధికారి శ్రావణి అన్నారు. గురువారం మండలంలోని గంగారం రైతువేదికలో ఉద్యానవనశాఖ పథకాల గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా శాశ్వత పందిళ్ల ఏర్పాటు చేసుకుని తీగజాతి కూరగాయలు పండించే రైతులకు ఎకరాకు రూ.లక్ష సబ్సిడీ అందిస్తామన్నారు. ఎంఐడీహెచ్ పథకంలో భాగంగా పండ్లు, పూల తోటలు, హైబ్రిడ్ కూరగాయల సాగు పెంపకు రాయితీ ఇస్తామన్నారు. ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఏఈవో సాయి వాసంతి, రైతులు పాల్గొన్నారు.

'లైఫ్‌స్కిల్ 'సర్టిఫికెట్ల అందజేత


లైఫ్‌స్కిల్ సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో భూమేశ్వరరావు

వైరా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాల విద్యార్థులు ఐఐటీ మద్రాస్ వారి లైఫ్ స్కిల్స్ సర్టిఫికెట్లను అందుకున్నారు. చెన్నైలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీ మద్రాస్ యూనివర్సిటీ వారు ఆఫర్ చేసిన వివిధ రకాలైన లైఫ్ స్కిల్స్ కోర్సులను న్యూ లిటిల్ ఫ్లవర్ కళాశాలకు చెందిన 44మంది విద్యార్థులు 8వారాలపాటు ఆన్‌లైన్‌లో శిక్షణ పొందారు. ఈ విద్యార్థులకు స్కిల్స్ సర్టిఫికెట్లను మద్రాస్ ఐఐటీ వారు విడుదల చేశారు. స్కిల్స్ సర్టిఫికెట్లను గురువారం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ భూమేశ్వరరావు అందించి వారిని అభినందించారు. డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపల్ భువనప్రసాద్, షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల విద్యార్థినులకు వైద్యపరీక్షలు

వైరా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసలిమడుగులో ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులకు వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గురువారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యపరంగా విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బి.శ్రీహర్ష, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయండి

తల్లాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వతేదీన తల్లాడలో జరిగే సీపీఐ తల్లాడ మండల మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు మద్దోజు శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి రవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ హాజరుకానున్నట్లు తెలిపారు.

నగదు రహిత వైద్యం అందించాలి

సత్తుపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు చెంచిరెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ తీర్మాన వివరాలను సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్‌లతో కలిసి తెలియజేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన నగదు రహిత వైద్య చికిత్సా విధానాన్ని అమలు చేస్తూ పెండింగ్‌లోని రిటైర్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు టై, బెల్ట్, ఐడీల అందజేత


టై, బెల్ట్, ఐడీకార్డులు ధరించిన విద్యార్థులు

ఏన్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బురదరాఘవాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు టై, బెల్ట్, ఐడీ కార్డులు ఉచితంగా అందించారు. హెచ్ ఎం.సాగి సుజాత, పొట్ట రామారావు భార్యభర్తలు. సొంత ఖర్చుతో వీటిని పంపిణీ చేశారు. మొత్తం 60మంది విద్యార్థులకు సుమారు రూ.8వేల విలువైన వస్తువులను అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం సాగిసుజాత, పొట్ట రామారావులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.పుల్లయ్య, డి.శ్రీనివాస్, ఆర్.విజయశ్రీ, కె.భారతి, బి.నాగేశ్వరరావు, టి.నరేష్, బావ్‌సింగ్ పాల్గొన్నారు.

నారపనేనిపల్లి పాఠశాలకు కంప్యూటర్లు


విక్టరీ సింబల్ చూపిస్తున్న విద్యార్థులతో ఎంఈవో వెంకటేశ్వర్లు

వైరా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారపనేనిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల మూతపడే దశ నుంచి నేడు 16మంది విద్యార్థులతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. గత జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ప్రత్యేక చొరవతో ఆ గ్రామాన్ని సందర్శించి విద్యాశాఖ అధికారులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను ఈ పాఠశాలకు పంపించేలా చేసిన ప్రయత్నాలు ఫలించాయి. స్వయంగా కలెక్టర్ ఈ గ్రామాన్ని సందర్శించిన సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.81,600విలువైన రెండు డెస్క్‌టాప్ కంప్యూటర్లను పాఠశాలలో ఏర్పాటుచేశారు. ఈ డెస్క్‌టాప్ కంప్యూటర్లతో విద్యార్థులకు పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఈ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాల అభివృద్ధికి తామెప్పుడూ అండగా ఉంటామని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈవో వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు.

బ్యాంకు ఖాతా నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

ఏన్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు గురువారం ఏన్కూరు ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ బాదావత్ జగన్ బ్యాంకు ఖాతాల నిర్వాహనపై అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, గుడ్‌న్యూస్‌పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమాయోజన, ప్రధానమంత్రి సురక్షబీమా యోజన ఇన్సూరెన్సు గురించి వివరించారు. రూ.20కే రెండులక్షల ప్రమాదబీమా, 18 ఏళ్లనుంచి 70 ఏళ్ల మధ్య వయస్సుగల బ్యాంకు ఖాతాదారులందరికి ఈ బీమాసౌకర్యం లభిస్తుందన్నారు. ప్రమాదం కారణంగా శాశ్వతవైకల్యానికి కూడా ఈబీమా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా ప్రధామంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన 18 ఏళ్ల నుండి 50 ఏళ్ల మధ్య వయస్సు బ్యాంకు ఖాతాదారులందరికి ఒక ఏడాదికి రూ.430తో రెండులక్షల జీవితబీమా వర్తిస్తుందన్నారు. ప్రవీణ్, సతీష్, నరసింహ సందీప్‌కుమార్‌నాయక్ పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ

ముదిగొండ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎలక్షన్ కమిషన్ తెలంగాణ వారు కండక్ట్ చేసిన బూతులెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు గురువారం ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీఎల్‌వోల పాత్ర ఎంతో కీలకమని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ అన్నారు. మండలంలో ఉన్న సహాయ ఓటరు నమోదు అధికారులు తమ విధిని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ ఇతర అంశాలపై శిక్షకులు వీరికి అవగాహన కల్పించారు. ట్రైనర్ ఏఎల్ఎమ్టీస్, సురేష్, టి.శ్రీనివాసరావు, డీటీ లక్ష్మీ, ఆర్ఐలు సుల్తానా, ప్రసన్నకుమార్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కల్లూరు పురపాలక వార్డుల విభజన

» జీవో జారీ చేసిన ప్రభుత్వం..


కల్లూరు పురపాలక కార్యాలయం

కల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన కల్లూరు పురపాలక సంఘం పరిధిలో వార్డుల విభజన కోసం ప్రభుత్వ జీవో జారీ చేసింది. ఈ మునిసిపాలిటీ పరిధిలో గల 18,691 ఓటర్లను ప్రాతిపదికన తీసుకుని 20 వార్డులుగా విభజించి తుది కసరత్తుగా ఈ జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పురపాలక కమిషనర్ పరిపాలన విభాగం జీవో ఎంఎస్ నెం, 131 ప్రకారం వార్డుల విభజన చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

వార్డుల విభజన ఇలా...

వార్డు నెం 1లో కప్పలబంధం, తూర్పు దళిత కాలనీ కలిపి 902 ఓటర్లు, 2వ వార్డులో బెంజి వీధి టు వాడపల్లి కరుణమ్మ వయా గ్రంథాలయం టు తూర్పు దళిత వాడలో కొంత భాగం వరకు కలిపి 947 మంది ఓటర్లు, వార్డు నెం 3లో శ్రీరాంపురం, ఖాన్‌ఖాన్‌పేట టు ఎన్నెస్పీ కెనాల్ వరకు కలిపి 950 ఓటర్లు, వార్డు నెం 4లో తిరువూరు క్రాస్ రోడ్ , ఖాన్‌ఖాన్‌పేట, ఎన్నెస్పీలో కొంత భాగం కలిపి 954 మంది ఓటర్లుగా సదరు వార్డును విభజించారు. వార్డు నెం 5లో జీడీబీపల్లి, మధిర రోడ్, ఎన్నెస్పీ కాలువతోపాటుగా శాంతినగర్, మధిర రోడ్ వైపున తూర్పు భాగం కొంత కలిపి 929 మంది ఓటర్లుగా విభజించారు, వార్డు నెం 6లో వాచ్యానాయక్‌తండ, బీసీ కాలనీ, రైస్ మిల్లు వీధి టు జీడీబి పల్లి బొడ్డురాయి సెంటర్ వరకు 987 మంది ఓటర్లుగా, వార్డు నెం 7లో హనుమాతండ, గనీయాతండ, లక్ష్మాతండ కలిపి 880 మంది ఓటర్లుగా, వార్డు నెం 8లో కిష్టయ్యబంజర, వీరబ్రహ్మేంద్రనగర్ కాలనీ, స్వాగత రెస్టారెంట్ టు గోపాలకుంట వరకు కలిపి 980 మంది ఓటర్లగా విభజించారు. వార్డు నెం 9లో పడమట లోకవరం మాత్రమే 932 ఓటర్లుగా, వార్డు నెం 10లో తూర్పు లోకవరం పడమట, తూర్పు విభాగం పుల్లయ్యబంజర కలపి 935 మంది ఓటర్లు, వార్డు నెం 11లో దక్షిణ, పడమట విభాగం పుల్లయ్యబంజరతోపాటుగా తూర్పు విభాగం రామానగర్ కాలనీ కలిపి 864 మంది ఓటర్లు, వార్డు నెం 12 పడమట విభాగం పుల్లయ్యబంజర రోడ్, ముత్యాలమ్మ వీధి, బోడ్డు కృష్ణా ఇంటి నుంచి వయా అంబేద్కర్‌నగర్ వీధి వరకు కలిపి 950 మంది ఓటర్లుగా, వార్డు నెం 13లో కుడి వైపున రియాజ్ ఇల్లు టు పుల్లయ్యబంజర రోడ్, ఇటికరాళ్ల చెరువు వరకు కలిపి 930 మంది ఓటర్లుగా విభజించారు. వార్డు నెం 14లో ఎడమ వైపున ఎల్‌వీఆర్ వీధి టు యుపిఎస్ వీధి, ఎడమ వైపున కట్టా గోపారావు ఇంటి నుంచి మిస్కిన్ ఇంటి వరకు కలిపి 921 మంది ఓటర్లుగా, వార్డు నెం 15 లో కప్పలబంధం రోడ్ టు ఎల్‌వీఆర్ వీధి, సాయి బాబా ఆలయం వీధి వరకు కలిపి 929 మంది ఓటర్లుగా విభజించారు. వార్డు నెం 16 లో ఎడమ వైపున విభాగం అంబేద్కర్‌నగర్ కాలనీ, విజ్ఞాన్ స్కూల్ రోడ్, తూర్పు దళిత కాలనీ, నారుమళ్ల విశ్వానాథం, వెంకటరత్నం, దక్షిణ విభాగం మేకల కృష్ణ వీధి వరకు కలిపి 919 మంది ఓటర్లుగా, వార్డు నెం 17లో ఎన్నెస్పీ కెనాల్ టు అంబేద్కర్‌నగర్ వరకు కలిపి 904 ఓటర్లుగా, వార్డు నెం 18లో శాంతినగర్ 2, 3 బ్యాంకు వీధి, మధిర రోడ్, చంద్రుపట్ల రోడ్, ఎన్నెస్పీ కెనాల్ టు పాత బస్‌స్టాండు, బొమ్మరిల్లు వెంచర్, బ్యాంకు వీధి, పాత సురేష్ హస్పిటల్ వరకు కలిపి 956 మంది ఓటర్లుగా విభజించారు. వార్డు నెం 19 లో కృష్ణ మార్కెట్, కొత్తబస్టాండు, కుడి వైపున శాంతినగర్‌లో కొంత భాగం 1, 3 పడమట విభాగం, శాంతినగర్ 2, 3 విభాగంలో కలిపి 983 ఓటర్లుగా, వార్డు నెం 20లో పడమట విభాగం పుల్లయ్యబంజర రోడ్ కొంత భాగం, పోలీసుస్టేషన్ ఏరియా, అంబేద్కర్‌నగర్ వీధిలో కొంత భాగం కలపి 939 మంది ఓటర్లుగా విభజించారు. పై విధంగా జారీ చేసిన ప్రభుత్వ గెజిట్ ప్రకారం పారదర్శకంగా వార్డుల విభజన జరిగిందని కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు.

ప్రభుత్వ పాఠశాలలకు డ్యూయల్ డెస్కుల అందజేత

» తోపుడుబండి ఫౌండేషన్ తరుపున రూ.4 లక్షల వితరణ


డ్యూయల్ డెస్కులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి) తోపుడు బండి ఫౌండేషన్ అధినేత స్వర్గీయ సాదిక్‌అలీ జయంతి సందర్భంగా గురువారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చేతుల మీదగా పలు ప్రభుత్వ పాఠశాలలకు డ్యూయల్ డెస్కులు అందజేశారు. తోపుడుబండి సంస్థ అధినేత సాదిక్‌అలీ జ్ఞాపకార్థంగా సతీమణి ఉష రూ. 4 లక్షల విలువ గల డ్యూయల్ డెస్కులను పాఠశాలలకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి చేత మండల పరిధిలోని కొర్లగూడెం పాఠశాలకు 16, ఖాన్‌ఖాన్‌పేట పాఠశాలకు 21, కల్లూరులోని ఎన్నెస్పీ పాఠశాలకు 18, అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాగమయి ప్రసంగిస్తూ సాదిక్‌అలీ ప్రభత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం ఎంతో సహాయం అందించారని అన్నారు. విద్యా రంగానికి సాదిక్‌అలీ చేసిన సేవలను కొనియాడారు. సాదిక్‌అలీ ప్రారంభించిన తోపుడు బండి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న ఉష సాదిక్‌ను ఎమ్మెల్యే రాగమయి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, సిడిసి చైర్మన్ కస్తాల నరేంద్ర, స్నేహ స్వచ్ఛంధ సంస్థ అధినేత ఎండి ఫయాజ్ (చిన్న బుట్టో), నిర్వహకులు కిషోర్‌దత్తు, పాఠశాలల హెచ్‌ఎంలు సుజాత, చక్రవర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు, కాంగ్రెస్ నాయకులు మధుసుధన్‌రెడ్డి, మట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి


తల్లాడలో పీర్ల ఊరేగింపు

తల్లాడ, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మొహర్రం వేడుకల సందర్భంగా గురువారం తల్లాడలో పీర్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. నారాయణపురం గ్రామ మొహర్రం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తల్లాడ, నారాయణపురం గ్రామాల్లో పీర్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాంబ్రాణి, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

ఏన్కూరు, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలతో గ్రామాలలో సందడి ఏర్పడింది. గురువారం ఏడవ షరగతులను టీఎల్‌పేట, రేపల్లెవాడ, తిమ్మరావుపేట, గార్లొడ్డు, నాచారం గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పీర్ల ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

5, 6 తేదిల్లో రాజకీయ శిక్షణ

కారేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల కార్యకర్తలకు 5, 6 తేదిలలో రాజకీయశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి కె.నరేందర్ గురువారం తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహన, ప్రపంచ, దేశ రాజకీయ పరిస్థితులపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గాంధీనగర్‌లో జరిగే శిక్షణ తరగతులకు కార్యకర్తలు సకాలంలో హాజరుకావాలని నరేందర్ కోరారు.

వివాహిత ఆత్మహత్య

» ప్రేమించి పెళ్లి చేసుకున్న పదినెలలకే మరణం
» కూతురి మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు ఫిర్యాదు
» భర్త, మరిది వేధింపులే కారణమని పుట్టింటివారి ఆరోపణ



మధిర రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి) : కన్నవాళ్లను కాదనుకుని.. పదినెలల క్రితం ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసిన ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన గురువారం ఖమ్మం మధిర మునిసిపాలిటీ పరిధిలో సాయినగర్‌లో జరిగింది. బాధితురాలి కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లికి చెందిన పారా కిషోర్, లక్ష్మీ దంపతుల కుమార్తె అంజలి(21) బీఎస్సీ నర్సింగ్ చదివింది. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన తడికమళ్ల రాము అనే యువకుడిని ప్రేమించింది. తల్లిదండ్రులకు ఇష్టం లేకుండానే ఆమె పదినెలల క్రితం రామును వివాహం చేసుకుంది. అనంతరం మధిరలోని సాయినగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కాపురం ఉంటున్నారు. రాము ఓ వాటర్ ప్లాంట్‌లో టెక్నికల్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నాడు. రాము దంపతులతో పాటు రాము సోదరుడు కూడా వారితో పాటే ఉంటున్నాడు. ఈ క్రమంలో అంజలి గురువారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్నం బయట నుంచి వచ్చిన రాము.. తన భార్య అంజలి ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే తమ కుమార్తె మృతిపై తమకు అనుమానాలున్నాయని అంజలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లయిన ఐదునెలల పాటు రాము, అంజలి బాగానే ఉన్నారని, ఆ తర్వాత నుంచి పుట్టింటికి వెళ్లి డబ్బులు తీసుకురమ్మని తమ కూతురిని రాము వేధిస్తున్నాడని, తరచూ మద్యం తాగుతూ మానసికంగా, శారీరకంగా వేధిస్తుండేవాడని ఆరోపిస్తున్నారు. రాముతో పాటు అతడి సోదరుడు కూడా అంజలిని వేధిస్తున్నాడని, అది తట్టుకోలేక తమ కుమార్తెకు ఈవిధంగా జరిగిందని, భర్త, మరిదే హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించి ఉంటారన్న అనుమానం ఉందని తల్లిదండ్రులు ఆరోపించారు. చదువుకున్న రోజుల్లోనే పరిచయమైన వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకున్న అంజలిని చివరికి నమ్మినవాడే కడతేర్చాడని తల్లిదండ్రులు, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్‌హెచ్‌వో రమేష్ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు తొలగింపు నోటీసులివ్వడం సరికాదు

» ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం సభ్యుల నిరసన

మధిర రూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం తొండలగోపవరం గ్రామపంచాయతీ పరిధిలోని తొర్లపాడు గ్రామంలో రోడ్డు పక్క ఉన్న మద్దాల ఏబుకు చెందిన ఇంటిని తొలగించాలని పంచాయతీ అధికారులు నోటీసులు ఇవ్వడం సరైంది కాదని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ గురువారం మధిర ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు బాధితుడితో కలిసి ఆందోళన నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి రోడ్డు పక్కనున్న పేదవాడి ఇంటిని తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం దారుణమని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. అధికార పార్టీ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు కూడా రాజకీయాలకతీతంగా అందరిని దృష్టిలో పెట్టుకొని పనిచేయాలన్నారు. ఒకవేళ ఆర్‌అండ్‌బీ స్థలం కానీ, పంచాయతీ స్థలం కానీ ఆక్రమణకు గురైతే వెలికితీయాలని కానీ పేదవాడికి నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. నోటీసులను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు అందజేశారు. సీపీఎం నాయకులు మందా సైదులు, ప్రభాకర్, రాంనర్సయ్య, వీరయ్య, మురళీ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి


ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సత్తుపల్లిరూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పట్టణాలతో పాటు మారుమూల, గ్రామీణ ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం గురువారం ఆమె ఆకస్మికంగా సత్తుపల్లి పట్టణంలో పర్యటించి సేవా వాలంటీర్ బ్లడ్ సెంటర్, లవ్‌లీ రక్త నిధి కేంద్రాలను పరిశీలించారు. బ్లడ్ బ్యాంక్ సొసైటీకి నమోదుకు చేసుకోగా విధివిధానాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అని, అమలు చేయాల్సిన బ్లడ్ డొనేషన్ క్యాంపులపై ఆరాతీశారు. నాణ్యమైన రక్తాన్ని ఇవ్వడం కోసం పరికరాలు ఎలా ఉన్నాయని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టోర్ కెపాసిటీ ప్రకారం రక్తాన్ని సేకరిస్తున్నారా లేదా, రోగి, డోనర్ వివరాలను నమోదు చేస్తున్నారా లేదా అని రికార్డులను పరిశీలించారు. రోగులకు సరిపడా రక్తాన్ని స్టోర్ చేయించాలని, పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన సేవలందించాలని సూచించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఇప్పటికే కలెక్టర్ స్థాయిలో సమీక్షా నిర్వహించామన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు సీజనల్ వ్యాధుల దృష్ట్యా సేవలందిస్తూ మందులను అందుబాటులో ఉంచాలని, అటవీ ప్రాంతాలవారికి సత్వరమే సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టీ.సీతారామ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కె.దేవేందర్‌రెడ్డి, లెప్రసీ పీవో వెంకటరమణ ఉన్నారు.

సోదరుడిని ప్రభుత్వ స్కూల్‌లో చేర్పించిన లెక్చరర్

సత్తుపల్లిరూరల్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఇటీవలే నియామకమైన నిహారిక తన సోదరుడిని సత్తుపల్లి ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో గురువారం చేర్పించారు. హెచ్‌ఎం రామ్మోహనరావు అడ్మిషన్ పత్రాన్ని విద్యార్థి అభినయ్ కృష్ణకు అందించారు.

కారేపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కృష్ణయ్య

కారేపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల ఇంచార్జ్ తహసీల్దార్‌గా కృష్ణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంత కాలం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సంపత్ కుమార్ మహబూబాబాద్‌కు బదిలీ కాగా కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులునిర్వహిస్తున్న కృష్ణయ్యకు కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. నూతన తహసీల్దార్ వచ్చేంతవరకు కృష్ణయ్య ఇంచార్జ్ తహసీల్దార్‌గా వ్యవహరిస్తారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

చింతకాని, జూలై 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బస్వాపురం, లచ్చగూడెం గ్రామాలకు చెందిన ఇద్దరు ఇటీవల ప్రమాదంలో మృతిచెందడంతో బస్వాపురం గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఖాతాదారులైన మృతులకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగంగా మంజూరైన రూ 2 లక్షల చెక్కులను మృతుల కుటుంబ సభ్యులకు బ్యాంక్ మేనేజర్ రాయల దయాకర్ గురువారం అందజేశారు. ప్రతీ బ్యాంకు ఖాతాదారుడు బీమా చేయించుకోవాలన్నారు.డిప్యూటి బ్యాంక్ మేనేజర్ శివకుమార్, షంషుద్దీన్, చారీ పాల్గొన్నారు.


అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తాం

వైరా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. వైరా మునిసిపాలిటీ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం తమ క్యాంపు కార్యాలయంలో మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంత ఇల్లు నిర్మాణ కల సాకారం చేయాలనే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తుంటే బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, సీతారాములు, మునిసిపల్ కమిషనర్ వేణు పాల్గొన్నారు.

రూ.15కోట్ల నిధులకు ప్రతిపాదనలు

వైరా, జూలై 3 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశానుసారం వైరా మునిసిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ.15కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే సీఎంవో కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రూ.వంద కోట్ల అభివృద్ధి పనుల కోసం పంపించిన ప్రతిపాదనలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అయితే ఆ నిధుల మంజూరు విషయంలో జాప్యం జరుగుతుండడంతో ముఖ్యమైన పనులను వెంటనే చేపట్టేందుకు రూ.15కోట్లకు ప్రతిపాదనలు పంపించాలని రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు మునిసిపల్ కమిషనర్ చింతా వేణు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించారు. డంపింగ్‌యార్డు నిర్మాణానికి రూ.4.5కోట్లు, సత్రంబజార్ నుంచి మధిర రోడ్డును అనుసంధాన రోడ్డు నిర్మాణానికి రూ.ఐదున్నర కోట్లు, 50గదులతో కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రూ.40లక్షలు, వైరా, పల్లిపాడుల్లోని జంక్షన్ల అభివృద్ధికి, మునిసిపాలిటీ పరిధిలోని శివారు గ్రామాల్లో ఇతర అభివృద్ధి పనులకుగానూ రూ.15కోట్లకు ప్రతిపాదనలు పంపించారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష, జరిమానా

మధిరటౌన్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఓ మహిళకు జైలు శిక్ష, జరిమాన విధించిన సంఘటన గురువారం మధిర కోర్టులో జరిగింది. మధిర మండలం రాయపట్నం గ్రామానికి చెందిన కఠారపు యశోద తన కుటుంబ అవసరాల కోసం మధిరకు చెందిన గద్దల దిలీప్ దగ్గర రూ 1.50 లక్షలు అప్పుగా తీసుకుని తిరిగిచ్చేప్పుడు ఆ మొత్తం చెక్కుగా ఇచ్చింది. బాధితుడు దానిని తన ఎకౌంట్‌లో జమ చేయగా చెక్కు ఇచ్చిన వారి ఖాతాలో సరిపోను బ్యాలెన్స్ లేక పోవడంతో అది బౌన్స్ అయ్యింది. దీనితో బాధితుడు మధిర కోర్టులో కేసు వేయగ ఈ రోజు మధిర కోర్టు ప్రథమ శ్రేణి న్యాయాధికారి వేముల దీప్తి చెక్కు ఇచ్చిన యశోదకు లక్ష రూపాయల జరిమానాతో పాటు, ఆరు నెలల జైలు శిక్ష విధించింది.